క్లుప్తంగా

చట్టాలపై అవగాహన

సత్తుపల్లిటౌన్: విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని 6వ అదనపు జిల్లా జడ్జి మారగాని శ్రీనివాస్ అన్నారు. సత్తుపల్లిలోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ కళాశాలలో శనివారం జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. కోర్టులు వాటి పనితీరును వివరించారు.కార్యక్రమంలో జూనియర్ సివిల్‌జడ్జి సాయినాగ సుమబాల, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ జె.గోపాలరావు, బార్ సెక్రటరీ సాధు కృష్ణయ్య, ప్రిన్సిపాల్ కె.వెంకట్రామయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పుణ్యక్షేత్రానికి పాదయాత్ర



పాదయాత్రగా వెళ్తున్న మహిళా భక్తులు

మధిర: మండలంలోని నిధానపురం గ్రామానికి చెందిన మహిళా భక్తులు సుమారు 20కిలోమిటర్ల దూరంలో ఉన్న జమలాపురం పుణ్యక్షేత్రానికి శనివారం పాదయాత్రగా తరలివెళ్లారు. తెలంగాణ చిన్న తిరుపతిగా పేరుగాంచిన జమలాపురం వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. పాదయాత్రగా తరలి వెళ్లిన వారిలో నిధానపురం గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ లక్ష్మి, వీరారెడ్డి, శ్రీలక్ష్మి, రామశేషమ్మ, రాజ్యలక్ష్మి, శివ నాగేంద్రమ్మ తదితరులు ఉన్నారు.

బ్రిడ్జిల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి

వైరా: ఖమ్మం నుంచి ఏపీలోని దేవరపల్లి వరకు నిర్మిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ హైవే రహదారి నిర్మాణంలో భాగంగా రైతులు పంట పొలాలకు వెళ్లేందుకు ఏర్పాటు చేస్తున్న బ్రిడ్జి నిర్మాణ పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని శనివారం వైరా మున్సిపాలిటీ శివారు సోమవరం గ్రామం వద్ద రైతులు ఆందోళన చేపట్టారు. నేషనల్ హైవే అధికారులు రైతులతో మాట్లాడి రైతులకు ఇబ్బందులు లేకుండా నిర్మాణాలు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు రైతులు పాల్గొన్నారు.

వైద్య సేవలు అందించాలి

తల్లాడ: తల్లాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో.. 24 గంటల సేవలు అందించేలా ఆస్పత్రిని అప్‌గ్రేడ్ చేయాలని భారత ప్రజాతంత్ర మహిళా సమాఖ్య (ఐద్వా)పేర్కొంది. తల్లాడ పీహెచ్‌సీని శనివారం ఐద్వా నాయకురాళ్లు పరిశీలించారు. ఈ సందర్భంగా మహిళా సంఘం రాష్ట్ర కోశాధికారి మాచర్ల భారతి మాట్లాడారు. పీహెచ్‌సీ పరిధిలో 42 గ్రామాలుండగా 60వేల మంది జనాభా ఉన్నారని, అందుకు తగిన విధంగా 30 పడకల ఆస్పత్రిగా పెంచి 24గంటలు వైద్య సేవలందించాలని డిమాండ్ చేశారు. అందుకు తగ్గట్లుగా అన్ని రకాల పరీక్షల మిషన్లు తెప్పించి, సిబ్బందిని పెంచాలన్నారు. కార్యక్రమంలో మహిళా సంఘం జిల్లా నాయకురాలు శీలం ఫకీరమ్మ, తమ్మిశెట్టి నాగమణి, పేరసాని లత పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలకు రూ. 27.50లక్షలు మంజూరు

బోనకల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మౌలికవసతుల కల్పనకు రూ. 27.50లక్షలు మంజూరైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ నళినిశ్రీ శనివారం తెలిపారు. కళాశాలలో తలుపులు, కిటికీలు, తరగతి గదుల్లో ఫ్లోర్ కుంగిపోవడం లాంటి పనులకు, టయిలెట్స్ రిపేర్‌కు ఈ నిధులు ఉపయోగించనున్నట్లు ఆమె తెలిపారు.

మాజీ ప్రధాని పీవీ సేవలు చిరస్మరణీయం



సత్తుపల్లిటౌన్: సత్తుపల్లిలో పీవీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మధిర/సత్తుపల్లిటౌన్: ఆర్థిక సంస్కరణలతో దేశానికి మాజీ ప్రధాని పివి నర్సింహారావు అందించిన సేవలు చిరస్మరణీయమని వక్తలు కొనియాడారు. శనివారం మాజీ ప్రధాని పివి నర్సింహారావు జయంతి సందర్భంగా శనివారం మధిర బ్రాహ్మణ పరిషత్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి బ్రాహ్మణ పరిషత్ అధ్యక్షులు కప్పగంతుల పట్టాభిరామ శర్మ, కోశాధికారి మాదిరాజు దుర్గాప్రసాద్ తదితరులు పూలమాలవేసి నివాళి అర్పించారు. అదే విధంగా సత్తుపల్లిలో కాంగ్రెస్ నాయకులు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు గాదె చెన్నారావు, ఉడతనేని అప్పారావు, తోట సుజలరాణి, ఎండి కమల్‌పాషా, దోమ ఆనంద్, చల్లగుళ్ల నర్సింహారావు, సామేలు, నారాయణవరపు శ్రీనివాస్, నాగభూషణం, గఫార్‌ఖాన్, నాగుల్‌మీరా, రాజేశ్వరప్రసాద్, బొమ్మకంటి హరిబాబు, కపిలవాయి కృష్ణ, ఊటుకూరు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నాగమల్లె పుష్పాలతో స్వామికి అర్చన

తల్లాడ: తల్లాడలోని రామలింగేశ్వరస్వామి దేవాలయంలో శనివారం స్వామివారికి నాగమల్లె పుష్పాలతో అర్చన చేశారు. కల్లూరు మండలం పుల్లయ్య బంజరుకు చెందిన ఓ భక్తుడు నాగమల్లె పుష్పాలను తీసుకొని రాగా ఆలయ ప్రధాన అర్చకులు కంచెల సతీష్ శర్మ స్వామిని అలంకరించి అర్చన చేశారు. ఈ సందర్భంగా శివలింగానికి అభిషేక పూజలు జరిగాయి.



సీసం గోలీల ఆటల పోటీలను ప్రారంభిస్తున్న ఎస్సై పుష్పాల రామారావు



గోలీల ఆట ఆడుతున్న చిన్నారులు, యువకులు

గ్రామీణ క్రీడలతో..
స్నేహబంధం మెరుగు

- అష్ణగుర్తిలో వినూత్నంగా సీసం గోలీల ఆటల పోటీలు
- బాల్యం ఆటను బతికించేందుకు ఫ్రెండ్స్ యూత్ ప్రయత్నం
- స్మార్ట్‌ఫోన్‌కు దూరంగా ఉండాలని అవగాహన

సండే స్పెషల్

వైరారూరల్: చిన్నారులు, యువకులు దశాబ్దాల కిందట గ్రామీణ ఆటలు ఆడుతూ అందిరితో స్నేహపూర్వకంగా మెలిగేవారు. ప్రస్తుత కంప్యూటర్ యుగంలో గ్రామీణ ఆటలు మచ్చుకైనా కనబడడం లేదు. తల్లిదండ్రులు సైతం తమ చిన్నారులు అల్లరి చేయకుండా స్మార్ట్ ఫోన్‌కు అలవాటు చేయడం, దాంతో చిన్నారులు పబ్జీ, ఫ్రీఫైర్, లూడో, క్యాండీ క్రష్, టెంపుల్ రన్ తదితర ఆటలకు బానిసలవుతున్న నేపథ్యాన బంధాలు, బంధుత్వాలు దూరవుతున్న సమయాన అష్ణగుర్తి గ్రామంలోని సిద్ధూ ఫ్రెండ్ యూత్ సభ్యులు చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ అందరిని ఒక ప్రదేశం వద్దకు చేర్చి సీసం గోలీల ఆటల పోటీలు నిర్వహించి, బహుమతులు అందించారు. దీంతో పలువురు ఆటల పోటీలో పాల్గొని సందడి చేయడంతో మంచి స్పందన లభించింది.

కనబడని గ్రామీణ ఆటలు..

గ్రామీణ ప్రాంతాల్లో పిల్లలు ఆడే ఆటలు కనుమరుగవుతున్నాయి. వీటిలో సీసంగోలీలు, కర్రబిల్లా, కబడ్డీ, తొక్కుడు బిల్లా, దాగుడుమూతలు, గిల్లిండా, చెమ్మచెక్క, ఖో-ఖో, అష్టాచమ్మా, వానగుంటలు మరియు గాలిపటాలు ఎగరవేడం తదితర ఆటలు ఆడేవారు. దీంతో వారందరి మధ్య స్నేహబంధం ఏర్పడేది. ప్రస్తుతం పిల్లలు స్మార్ట్‌ఫోన్, కంప్యూటర్లు, టీవీలతో కాలక్షేపం చేస్తున్నారు. శారీరక శ్రమను కల్పించే క్రీడలకు దూరం అవుతున్నారు. దాంతో గ్రామీణ ప్రాంత ఆటలు మచ్చుకైనా కనబడడం లేదు.

బంధుత్వాలు దూరం..

స్మార్ట్ ఫోన్లలో పలు రకాల విచిత్రమైన ఆటలు అందుబాటులో ఉండటంతో.. పిల్లలు, యువకులు అనే తేడా లేకుండా రాత్రింబవళ్లు ఫోన్లలో ఆటలు ఆడుతూ తమ భవిష్యత్‌ను అంధకారంలో పడేసుకుంటున్నారు. ఆటలకు బానిసలై విచిత్రంగా ప్రవర్తించిన సంఘటనలు లేకపోలేదు. అయినా నిలువరించడంలో తల్లిదండ్రులు విఫలమవుతున్నారు. కొంతమంది యువకులైతే ఫోన్లలోనే బెట్టింగులు పెడుతూ.. తమ జీవితాలను నాశనం చేసుకోవడంతో పాటు తమ కుటుంబాలను సైతం ఇబ్బందులకు గురిచేస్తున్నారు. దీంతో బంధుత్వాలు కూడా దూరంగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది.

స్మార్ట్ ఫోన్ ఆటలతో అనర్థాలు..



తల్లిదండ్రులకు తమ పిల్లలకు స్మార్ట్‌ఫోన్ ఇవ్వకుండా నిలువరించాలి. చిన్నారులు, యువకులు నిత్యం ఫోన్లలో వివిధ ఆటలు ఆడుతూ వాటికి బానిసలు అవుతున్నారు. పిల్లలు నిత్యం ఫోన్లలో ఆటలు ఆడడంలో చిన్నతనం నుంచే కంటి సమస్యలు ఎదురవుతున్నాయి. ఇకనైనా తల్లిదండ్రులు ఫోన్ల వలన కలిగే అనర్థాలను తమ పిల్లలకు వివరించి, గ్రామీణ ఆటలపై ఆసక్తి పెంచేలా అవగాహన కల్పించాలి.

– పుష్పాల రామారావు, ఎస్సై, వైరా

స్నేహ బంధాలు పెంచేందుకు..



ప్రస్తుత కంప్యూటర్ యుగంలో బంధాలు, బంధుత్వాలే కాకుండా స్నేహ బంధాలు కూడా సన్న గిల్లుతున్నాయి. దాంతో చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసేందుకు ఫ్రెండ్స్ యూత్ సభ్యులు ఏర్పాటు చేసిన సీసం గోలీల ఆటలను వైరా ఎస్సై పుష్పాల రామారావు ప్రారంభించారు. భవిష్యత్‌లో మరికొన్ని గ్రామీణ ఆటల పోటీలు ఏర్పాటు చేసి స్నేహ బంధాలను పెంచాలనేది ప్రధాన ఉద్దేశ్యం.

– చిత్తారు సిద్ధూ, ఫ్రెండ్స్ యూత్ నిర్వాహకుడు, అష్ణగుర్తి

ఆయిల్ పామ్ సాగు లాభదాయకం



ఆయిల్‌పామ్ మొక్క నాటుతున్న అధికారులు

పెనుబల్లి: ప్రస్తుత వాతావరణ పరిస్థులను బట్టి రైతులు ఆయిల్ పామ్ సాగు చేసుకోవడం లాభదాయకమని ఉద్యానవన అధికారి నగేష్, ఆయిల్ ఫెడ్ పీల్డ్ ఆఫీసర్ నాగలక్ష్మి రైతులకు సూచించారు. శనివారం మండల పరిధిలోని సోమరాజు నరసింహారావు, వెంకట శ్యాంప్రకాశ్, రామకిషన్ రైతుల భూమిలో చేపట్టిన ఆయిల్‌పామ్ మెగా ప్లాంటేషన్ ప్రోగ్రాంలో పాల్గొని మాట్లాడారు. ఈ పంట ఒకసారి నాటితే 30 సంవత్సరాల వరకు ఆదాయాన్ని అందిస్తుందని, ప్రకృతి వైపరీత్యాల నుండి హానిలేని పంట అని, చీడ పీడలు తక్కువగా ఆశించే పంట అని, మార్కెట్ సౌకర్యం ఎక్కువగా ఉందని తెలిపారు. అధికారులు, రైతులు పాల్గొన్నారు.

యాచకుడికి సపర్యలు



యాచకుడిని నగదు అందిస్తున్న స్థానికులు

తల్లాడ: తల్లాడలో శనివారం ఓ యాచకుడికి స్థానికులు సపర్యలు చేశారు. వైరా మార్గం నుంచి తల్లాడ చేరుకున్న యాచకుడు గత కొన్ని రోజులుగా స్నానం చేయకపోవటంతో చినిగిపోయిన బట్టలతో దుర్వాసన వస్తున్నప్పటికీ ఎన్‌జీఓ కావేటి రాధాకృష్ణమూర్తి, రాయల బాలరాజు, మార్తామ్మ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు శ్రీనివాసరావు.. అతని జుట్టు కత్తిరించి స్నానం చేయించారు. మట్టమ్మ హోటల్ యాజమాన్యం సరికొండ అప్పలరాజు, లక్ష్మీపద్మావతి దంపతులు అందించిన దుస్తులను యాచకుకిని ధరింపజేశారు. కొంత నగదు కూడా అందజేశారు. అతడు కడప జిల్లా వాసి అని, పేరు గురప్ప అన్నాడని, వారు తెలిపారు. హమాలీ వర్కర్స్, వెల్డర్స్, రంగయ్య, సురేష్, రాజు, జగన్, హనుమంత్, బాబు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

బ్యాగులు వితరణ



విద్యార్థులకు బ్యాగులు అందిస్తున్న నాగులంచ శ్రీనివాసరావు

వేంసూరు: వేంసూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి నాగులంచ శ్రీనివారావు, తన తండ్రి పుల్లయ్య జ్ఞాపకార్థం పాఠశాలలో చదువుతన్న 210మంది విద్యార్థులకు రూ.90వేల విలువ గల స్కూల్ బ్యాగులను శనివారం పంపిణీ చేశారు. అదే విధంగా పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్ ఇన్‌స్ట్రక్టర్‌కు ప్రతి నెల రూ.10 వేల చొప్పులన వేతనం అందిస్తానని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం బి.కె నరసింహరావు, మాజీ సర్పంచ్ ఎండీ ఫైజుద్దీన్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ హుస్సేన్‌బీ, పాఠశాల పూర్వ విద్యార్థులు బాస్కరరావు, వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

అన్నప్రసాద వితరణ



వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులకు అన్నదానం చేస్తున్న దృశ్యం

సత్తుపల్లిరూరల్: పట్టణంలోని ద్వారకాపురి కాలనీలోని శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ప్రతీ శనివారం అన్నప్రసాద కార్యక్రమాన్ని ప్రారంభించారు. మందపాటి కేశవరెడ్డి, స్వరాజ్యలక్ష్మి దంపతులు రూ.15వేల వితరణ చేయగా.. స్టీల్ కంచాలు, గ్లాసులను సింగరేణి ఉద్యోగి జి.బాలకృష్ణ, రాధిక దంపతులు అందించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు చంద్రారెడ్డి, ద్రోణంరాజు మల్లికార్జునశర్మ, సోమిశెట్టి శ్రీధర్, గాదె నాగు, నాగార్జున, మహేష్, అనిల్ పాల్గొన్నారు.

స్పోర్ట్స్ యూనిఫాం అందజేత

చింతకాని: మండలంలోని కొదుమూరు జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల విద్యార్థులకు 1989–90 సంవత్సరంలో పది చదివిన పూర్వ విద్యార్థులు స్పోర్ట్ యూనిఫాం వితరణ చేశారు. వీటిని పాఠశాల హెచ్‌ఎం సీహెచ్.శ్రీనివాసరావు విద్యార్థులకు శనివారం పంపిణీ చేసి మాట్లాడుతూ.. ప్రతీ విద్యార్థి చేయూతను అందించాలన్నారు. అనంతరం పూర్వ విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రాచబంటి రాము, సీహెచ్ శ్రీను, చిట్టిమోదు లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

కొణిజర్ల: ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స అనంతరం విశ్రాంతి తీసుకుంటున్న సీపీఎం వైరా నియోజకవర్గ కార్యదర్శి భూక్యా వీరభద్రాన్ని శనివారం పంచాయతీ వర్కర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, కొణిజర్ల మండల అధ్యక్ష కార్యదర్శులు నల్లమోతు నరేష్, గరిడేపల్లి భాస్కరరావు, నాయకులు రేగళ్ల వెంకటేశ్వర్లు తదితరులు పరామర్శించి ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని అభిలాషించారు.

విద్యార్థులకు సత్కారం..

సత్తుపల్లిరూరల్: స్థానిక విశ్వశాంతి విద్యాలయంలో చదువుతున్న విద్యార్థులను యాజమాన్యం ఘనంగా సత్కరించింది. చిన్నారులు తమ పాకెట్ మనితో వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చారని, వారిని అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకులు నాగేశ్వరరావు, సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్టేషన్ ఘన్‌పూర్ కమిషనర్‌కు సత్కారం

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి మున్సిపాలిటీలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తూ స్టేషన్‌ఘన్‌పూర్ మున్సిపల్ కమిషనర్‌గా ఉద్యోగ ఉన్నతితో బదిలీపై వెళ్తున్న రాధాకృష్ణను శనివారం స్థానిక మున్సిపాల్ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కమిషనర్ కె.నర్సింహా, కాంగ్రెస్ నాయకులు చెన్నారావు, సుజలరాణి, కమల్‌పాషా, నర్సింహారావు, సామేలు, నాగభూషణం పాల్గొన్నారు.

నియామకం

వేంసూరు: జాతీయ మానవ హక్కుల సంఘం వేంసూరు మండల చైర్మన్‌గా మల్లెల్లి రాజశేఖర్‌ను నియమించారు. ఈ మేరకు ఖమ్మం జిల్లా చైర్మన్ పత్తికొండ శ్రీనివాసరావు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.


సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే రాగమయి



సీఎంకు వినతి అందిస్తున్న సత్తుపల్లి ఎమ్మెల్యే

సత్తుపల్లి: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారు నరేందర్‌రెడ్డి శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకర్గ సమస్యలు, అభివృద్ధి పనుల మంజూరుపై వినతిపత్రం అందించారు. అదే విధంగా వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి డాక్టర్ దామోదర రాజనర్సింహాను కలిసి నియోజకవర్గంలోని కల్లూరు, పెనుబల్లి ప్రభుత్వాస్పత్రుల్లో డయాలసిస్ కేంద్రాలు మంజూరు చేయాలని కోరారు. సత్తుపల్లిలో 100పడకల ఆస్పత్రి, నర్సింగ్ కళాశాల భవన పనుల పురోగతిని వివరించారు.

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే రాందాస్‌నాయక్..



కలెక్టర్ అనుదీప్‌తో ఎమ్మెల్యే, నాయకులు

వైరా: వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ శనివారం ఇటీవల జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, టీపీసీసీ కార్యదర్శి కట్ల రంగారావు, శీలం వెంకటనర్సిరెడ్డి ఏదునూరి సీతారాములు, నారాయణరావు, రామారావు, సౌజన్య, పుల్లయ్య, వెంకటేశ్వరరావు, గంగారావు, శ్రీను, అశోక్, సైదా, గోపి, జాన్‌పాషా, మురళి, బాలు తదితరులున్నారు.

జాగ్రత్తలు పాటించాలి

వేంసూరు: రైతులు వానాకాలంలో విద్యుత్ మోటర్ల వద్ద జాగ్రత్తలు పాటించాలని విద్యుత్ శాఖ ఏడీ బి.ప్రసాద్ బాబు అన్నారు. శనివారం మండలంలోని భీమవరంలో పొలం బాట కార్యక్రమంలో పాల్గొని రైతులకు అవగాహన కల్పించారు. కెపాసిటర్ల వినియోగంపై వివరించారు. కార్యక్రమంలో ఏఈ అంకారావు, వెంకటేశ్వరరావు, రాజేష్, రైతులు పాల్గొన్నారు.

కొత్తపాలెంలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు

ఎర్రుపాలెం: మండలంలోని కొత్తపాలెం గ్రామంలో శనివారం నూతన విద్యుత్ స్తంభాలను, విద్యుత్ లైన్లను అధికారులు ఏర్పాటు చేశారు. పనుల నిమిత్తం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మంజూరు చేసిన నిధులతో 15 విద్యుత్ స్తంభాలు, లైన్లు ఏర్పాటు చేశారు. పనులను విద్యుత్ ఏఈ జి.అనూష శనివారం పరిశీలించారు. కార్యక్రమంలో ఏఎల్‌ఎం వంశీకృష్ణ, నాయకులు రంగారావు, ధర్మారావు, నాగయ్య, పూర్ణ, రవి, ఆంజనేయులు, హనుమయ్య తదితరులున్నారు.

ఇందిరమ్మ ఇళ్లు వెంటనే పూర్తి చేయాలి



ముగ్గు వెంకటాపురంలో ఇందిరమ్మ ఇంటి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ చంద్రశేఖర్

కల్లూరురూరల్: మండలంలోని ముగ్గువెంకటాపురం గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని ఎంపీడీఓ దాసరి చంద్రశేఖర్ శనివారం పరిశీలించారు. లబ్ధిదారులు త్వరితగతిన గృహ నిర్మాణం పూర్తి చేయాలని, దానికి సంబంధించి దశలవారీగా బిల్లులు చెల్లించడం జరుగుతుందన్నారు. అదే విధంగా అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి మెనూ ప్రకారం పిల్లలకు పౌష్టికాహారం అందించాలని ఆదేశించారు. అంగన్‌వాడీ టీచర్లు సమయపాలన పాటించాలన్నారు. గ్రామంలో నర్సరీని సందర్శించి హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, చనిపోయిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలు నాటాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు.

భారీగా మొక్కలు నాటాలి



జన్నారంలో నర్సరీని పరిశీలిస్తున్న ఏపీడీ చలపతిరావు

ఏన్కూరు: మండలంలోని నూకాలంపాడు, జన్నారం ఎస్టీ కాలనీలోని నర్సరీలను ఈజీఎస్ ఏపీడీ చలపతిరావు సందర్శించారు. తూతుక్క లింగన్న పేటలో ఎవెన్యూ ప్లాంటేషన్ పనులు పరిశీలించి, పలు సూచనలు చేశారు. అనంతరం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందిలో సమీక్ష సమావేశం నిర్వహించారు. జూలైలో నిర్వహించే వనమహోత్సవానికి ప్రతి గ్రామంలో పెద్ద ఎత్తున మొక్కలు నాటించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఈజీఎస్ సిబ్బంది సహాయంతో మొక్కలు నాటించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నారాయణ, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

పేదల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులే..

రెండో రోజు సీపీఎం శిక్షణా తరగతులు



వైరారూరల్: మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

వైరారూరల్/ఎర్రుపాలెం: ప్రజా సమస్యలపై పాలకులను నిలదీసి, పేదల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులేనని సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు పొన్నం వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బొంతు రాంబాబు, సీపీఎం మధిర డివిజన్ కార్యదర్శి గోపాలరావు తెలిపారు. వైరా మండలంలోని గన్నవరం గ్రామంలో, ఎర్రుపాలెంలోని సీపీఎం కార్యాలయంలో శనివారం రెండో రోజు నిర్వహించిన రాజకీయ శిక్షణ తరగతుల్లో వారు పాల్గొని మాట్లాడారు.దేశంలో కేంద్రప్రభుత్వం రైతు వ్యతిరేకిగా పని చేస్తుందన, పత్తి మార్కెట్లను ప్రవేటీకరించి రైతాంగాన్ని ఇబ్బందులకు గురిచేసే ప్రయత్నాలు చేస్తుందన్నారు. కేంద్రం తీసుకొస్తున్న నల్ల చట్టాలపై రైతులు పోరాడాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. పార్టీ బలోపేతం కోసం కార్యకర్తలు, నాయకులు ఎలా పని చేయాలో వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి ప్రభాకర్‌రావు, జిల్లా కమిటీ సభ్యుడు దివ్వెల వీరయ్య, డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ అధ్యక్షులు బషీరుద్దీన్, పార్టీ నాయకులు సుధాకర్, వెంకటరెడ్డి, మోహన్‌రావు జయరావు, తిరుమలరావు, రమణ, జోగయ్య, బసవయ్య, సంజీవరావు, కోటేశ్వరరావు, హనుమంతరావు, లాలా, టిన్నిషన్, నాగుల్‌మీరా తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలి



మాట్లాడుతున్న జితేందర్‌రెడ్డి

చింతకాని: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు జమ్ముల జితేందర్ రెడ్డి అన్నారు. మండలంలోని రామకృష్ణాపురంలో నిర్వహించిన తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మండల మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులు, వ్యవసాయ కూలీల పట్ల మోదీ ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ చూపిస్తుందన్నారు. ఈ సందర్భంగా పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి.. వ్యవసాయ కార్మిక సంఘం మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా వేముల జానికీరాములు, కార్యదర్శి గోగుల ఆదినారాయణ లతో పాటు మరో 19మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సభలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు గోవిందరావు, జిల్లా కార్యవర్గ సభ్యుడు రవీంద్రబాబు, జిల్లా సమితి సభ్యులు మల్లికార్జున్‌రావు, ఏసు, రవి, మోహన్‌రావు, శ్రీరాములు, సీపీఐ మండల కార్యదర్శి గోపాలరావు, సహాయ కార్యదర్శులు మహేష్, శ్రీను, విజయమ్మ, రైతు సంఘం నాయకులు, ఏఐవైఎఫ్ జిల్లా కోశాధికారి కొల్లి రవి తదితరులు పాల్గొన్నారు.

సమ్మెతో కనువిప్పు కలగాలి



వైరా: బాట్లింగ్ యూనిట్ మేనేజర్‌కు సమ్మె నోటీస్ అందజేస్తున్న హమాలీలు

వైరా/సత్తుపల్లిరూరల్: జూలై 9న దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న సార్వత్రిక సమ్మెతో ప్రధాని మోదీకి కనువిప్పు కలగాలని, సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ వైరా పట్టణ కమిటీ కన్వీనర్ అనుమోలు రామారావు, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ఐఎన్‌టీయూసీ, సీఐటీయూ, టీబీజీకేఎస్ అధ్యక్షులు త్యాగరాజన్, రాజారెడ్డి, కాపు కృష్ణలు పిలుపునిచ్చారు. సీఐటీయూ వైరా పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక బాట్లింగ్ యూనిట్‌లో మేనేజర్‌కు హమాలీలు సమ్మె నోటీస్ అందించారు. సత్తుపల్లి జేవీఆర్ ఓసీలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సముద్రాల సుధాకర్ అధ్యక్షతన నిర్వహించిన సింగరేణి కార్మికుల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. దేశంలో కార్మికవర్గాన్ని విచ్ఛిన్నం చేసేందుకు చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలన్నారు. లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేసి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి సింగం నర్సింహారావు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ, కార్యదర్శి సముద్రాల సుధాకర్, ఉపాధ్యక్షులు దారా భీమయ్య, భరణి, రామారావు, సూర్యప్రకాష్, నిమ్మటూరి రామకృష్ణ, యోబు, ఐఎన్‌టీయూసీ నాయకులు రజాక్, రాఘవవు, భట్టి విక్రమార్క, సీఐటీయూ నాయకులు, టీబీజీకేఎస్ నాయకులు, ఏఐటీయూసీ నాయకులు, కార్యకర్తలు, కార్మికులు పాల్గొన్నారు.

ఆదర్శ ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంఈఓ దామాల పుల్లయ్య

బోనకల్: తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించిన ఉపాధ్యాయులు గంగాభవాని, పావనిలను ఎంఈఓ దామాల పుల్లయ్య శనివారం సన్మానించి అభినందించారు. జానికీపురం ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. బడిబాట కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి ఆదర్శంగా నిలిచారన్నారు. దీంతో గ్రామస్తులు కూడా తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గుగులోత్ రామకృష్ణ, సద్దాబాబు, చిన్నరంగారావు, గోపాల్‌రావు, రత్నాకర్, జ్యోతి, దేవి పాల్గొన్నారు.

కాలువ ఇలా.. నీరు పారేదెలా



పుణ్యపురం మేజర్ కాల్వలో మొలిచిన పిచ్చి మొక్కలు

కల్లూరురూరల్: కల్లూరు నుంచి పుణ్యపురం మేజర్ కాలువకు మరమ్మతులకు నోచుకోవడం లేదు. కాలువలో పిచ్చి మొక్కలు, చెట్ల మొలవడంతో పాటు పూడిక పేరుకుపోయింది. దీంతో నీరు ముందుకు సాగని పరిస్థితి ఏర్పడింది. ఈ కాలువ కింద సుమారు. 14వేల ఎకరాల ఆయకట్టు రైతులు సాగు చేసుకుంటున్నారు. వార్షాకాలం సీజన్ ప్రారంభమవడంతో మరో నెల పదిహేను రోజుల్లో వరితో పాటు వివిధ పంటలకు సాగునీరు అందిచాల్సి ఉండగా.. కాలువలో నీరు ముందుకు సాగని పరిస్థితి. కనీసం ఇకనైనా జలవనరుల శాఖ అధికారులు సాగర్ కాల్వ రిపేర్లు, మైనర్ కాల్వలో పూడికలు తీసి చెట్లు తొలగించాలని రైతులు కోరుతున్నారు.